# ఉత్తరం

"మధ్యాహ్నం పన్నెండు గంటలు అయింది."

జానకమ్మ వంటపని ముగించి చేతులు తుడుచుకుంటూ బయట కొచ్చింది వంటింట్లోంచి. ఇంకా రావుగారు రాలేదు ఆఫీసు నుంచీ. నాలుగేళ్ళ సుధీర్, మంచం మీద పుడుకుని నిద్రపోతున్నాడు. పెద్దకొడుకు చంద్రం ఏడేళ్ళవాడు. ఎండలో ఎక్కడకు వెళ్ళాడో వెధవ! అన్నం అన్నా తినలేదు. రోజురోజుకీ మరీ అల్లరి వాడైపోతున్నాడు అనుకుంటూ విసుగ్గా సుధీర్ పక్కనే పడుకుంది జానకమ్మ భర్తకోసం ఎదురుచూస్తూ



అరగంట గడిచింది. రావుగారు ఇంటికి వచ్చారు. గట్టిగా నిట్టూరుస్తూ... అక్కడే ఉన్న పడకకుర్చీలో కూర్చున్నారు.

"మళ్ళీ కూర్చున్నారేం? ఒంటిగంట అవుతోంది. భోజనం చేద్దురుగాని లెండి. వడ్డిస్తాను అంటూ లోపలకెళ్ళింది జానకమ్మ."

"చంద్రం ఏడీ! ఎండలో ఎక్కడకు వెళ్ళాడు? ఆయన మాట పూర్తికాకుండానే నాన్నా... నాన్నా... నా పెన్సిల్ తెచ్చావుకదూ... అంటూ రాకెట్‌లా దూసుకొచ్చాడు లోపలకు చంద్రం."

"అరె! మర్చిపోయామురా! సాయంత్రం తప్పకుండా తెచ్చిపెడతాముగా... రా... అన్నం తిందాం."

"ఆ... నాకేం అక్కర్లేదు... పెన్సిల్ లేకపోతే... రేపు మాస్టారు తంతానన్నారు. నువ్వెప్పుడూ ఇంతే... ఏడుస్తూ లోపలకెళ్ళాడు చంద్రం."

"అన్నం పెట్టాను రండి! చంద్రం వచ్చినట్లున్నాడే... వెధవ! ఎక్కడికెళ్ళాడో... ఎండలో వాడిని కూడా రమ్మనండి."

"ఆ... ఆ... వస్తున్నా... చూడు... చంద్రానికి కోపం వచ్చింది. నామీద కాస్త బతిమాలి తీసుకురా... అని పీటమీద కూర్చున్నారు రావుగారు."

"జానకమ్మ గదిలోకి వెళ్ళింది."

మంచం మీద బోర్లా పడుకున్నాడు చంద్రం.

"జానకమ్మకు వాడిని చూస్తే నవ్వు వచ్చింది. నెమ్మదిగా వాడి పక్కనే కూర్చుని... తల నిమురుతూ... చూడు బాబూ! నాన్నగారు... పెన్సిల్ తేలేదనేగా నీ కోపం! సాయంత్రం తప్పక తెస్తారుగా... లే... నాన్న భోజనం చేస్తున్నారు నువ్వు కూడా తిందువుగానీ."

"నాకేం అక్కర్లా! అంటూ విసురుగా ఆమె చేయి తోసేశాడు చంద్రం."

"జానకమ్మ ఎన్నోవిధాల బతిమాలింది. అయినా మొండికెత్తాడే చంద్రం."

"భరించలేని కోపంతో... వెధవ మొండి పట్టుదల ఎందుకూ! చెప్పినమాట వినటం లేదు సరికదా. ఎదురు సమాధానం కూడానా? వెధవ తలబిరుసుతనం ఎక్కువయింది. లే... లేచి... అన్నం తిను... తింటావా... తినూ... అంటూ దబదబా నాలుగు చరుపులు చరిచింది జానకమ్మ కోపంతో."

"ఇంక చేసేదేమీ లేక... ఏడుస్తూ లేచి వంటింట్లోకి వెళ్ళి తండ్రిపక్కనే చతికిల పడ్డాడు చంద్రం."

"ఏమిటే! కొట్టావా?"

"ఆ... కొట్టాను... మీరూరుకోండి... అసలు మీ మూలానే... వాడిలా మొండిగా తయారయాడు... పొద్దుటినుంచీ కాకిలా ఎండలో తిరిగి... చదువూ... సంధ్యాలేదు... పెన్సిలు కావాలట... పెన్సిలు... ఈసారి ఇలా మొండిపట్టు పట్టావంటే చంపేస్తాను... జాగ్రత్త."

"ఇంక చాల్లే... ఊరుకో! అన్నట్లుగా సంజ్ఞ చేశారు రావుగారు. చంద్రం ఎక్కిళ్ళు పడుతూ... బలవంతంగా ముద్దలు నోట్లో కుక్కుకుంటున్నాడు."

"మౌనంగా భోజనం కానిచ్చి లేచి వెళ్ళిపోయారు రావుగారు."

"బలవంతంగా అన్నం తిని... ఎక్కిళ్ళతో వెక్కెక్కిపడుతూ... గదిలోకి వెళ్ళిపోయాడు చంద్రం, చొక్కాతో కళ్ళు తుడుచుకుంటూ."

"బయటకు వెళ్ళావంటే కాళ్ళిరగకొడతాను... జాగ్రత్త! అన్న భార్య మాటలు వినగానే రావుగార్కి నిజంగానే కోపం వచ్చింది."

భార్యవైపు మందలింపుగా చూసి... చంద్రం గట్టిగా పిలిచారు... పలకలేదు.

తిరిగి చంద్రం... బాబూ!

తండ్రి పిలుపు వినిపించి కూడా పలుకలేదు చంద్రం.

"నెమ్మదిగా గదిలోకి వెళ్ళారు రావుగారు.

మంచంమీద బోర్లా పడుకుని ఎక్కెక్కి ఏడుస్తున్నాడు చంద్రం.

"చూడు నాన్నా! అమ్మని అలా ఎదిరించవచ్చా! నీకు పెన్సిలేగా కావాల్సింది. సాయంత్రం తప్పకుండా తెచ్చిపెడతాను. తేలేదనుకో అపుడు నువ్వు నాతో మాట్లాడవద్దు. సరేనా... అవునూ... నీకేరంగు పెన్సిలు తేవాలి? మరి నాకు తెలియదే ఎలా ఆ నువ్వే చెప్పు ఏ రంగు."

దాంతో ఏడుపంతా ఎగిరిపోయి ఒక్కసారిగా మంచంమీద ఎగిరి కూర్చుని. "నాన్నా! నాకు ఎర్రటి పెన్సిలు కావాలి. అందరి పెన్సిళ్ళ కంటే నాదే బాగుండాలి. కింద రబ్బరు కూడా ఉంటుంది మీకు తెలుసా..."

అలాగే బాబూ! ఎర్రటి పెన్సిలు... అంతే కదా సాయంత్రం ఆఫీసునుంచీ వస్తూ తెస్తాను. సరేనా! కాసేపు పడుకో! ఎండలో తిరక్కు అమ్మని విసిగించవద్దు పడుకో.

"వెంటనే పడుకున్నాడు చంద్రం."

రెండునిమిషాల్లో నిద్రలోకి జారిపోయాడు. అమాయకంగా నిద్రపోతున్న అతన్ని చూసి రావుగారి హృదయం ద్రవించింది అతని ప్రక్కనే తనూ పడుకుని నిద్రలోకి జారిపోయారు.

★ ★ ★

"ఒరే! సుధా! నాన్న నాకు పెన్సిల్ తెచ్చారు... బలే... ఎలా ఉందో చూడు! గీతలు గూడా ఉన్నాయి. ఎంత బాగా రాస్తుందో తెలుసా! తప్పులు రాస్తే చెరుపుకోవటానికి రబ్బరు కూడా ఉంది మురిసిపోతూ తమ్ముడికి చెబుతున్నాడు చంద్రం. ఆ చిన్నారి మనసులో కూడా చిన్న కోరిక."

అలాంటి పెన్సిల్... తనకి కూడా ఉంటే తనూ ఎంచక్కా రాసుకోవచ్చు... అన్నా నాకో చాలి ఇయ్యవూ... తూచి ఇత్తాగా... అంటూ ఆశగా అన్న కళ్ళలోకి చూశాడు సుధీర్.

"అమ్మో! పాడైపోతుంది. నేనివ్వను బాబూ! కావాలంటే నాన్నని అడుగు నీకూ కొనిస్తారు."

ఊహూ! నాకదే కావాలి... ఇవ్వూ... నాన్నని నువ్వే అలుగూ... ఇవ్వవూ... ఊహూ నోరు మూసుకొని లోపలకుపో నేనివ్వనే ఇవ్వను కోపంగా అన్నాడు చంద్రం.

"సుధీర్ దృష్టంతా ఆ పెన్సిల్ మీదే ఉంది. అన్నదగ్గర నుంచి లాక్కుంటే తన్నేంచేస్తాడు! అమ్మదగ్గరికి పారిపోతాగా... ఈ ఆలోచన రాగానే అన్న చేతిలోంచి పెన్సిల్ లాక్కుని అరుగుమీద నుంచి పరుగెత్తబోయాడు తప్పటడుగులతో సుధీర్."

చంద్రానికి కోపం విపరీతంగా వచ్చేసింది. తను ఏడిచి దెబ్బలు తిని నాన్నగారితో తెప్పించుకున్న పెన్సిలు లాక్కున్నాడు. వీడి పని చెప్పాలి అనుకుంటూనే సుధీర్ చేతిలోని పెన్సిల్ లాక్కుని ఒక్కతోపుతోసాడు క్రిందకు.

"ఎత్తైన ఆ అరుగు మీదనుంచి ఒక్కసారిగా క్రిందకు పడ్డాడు సుధీర్ అంతే!"

అరుగుమీద నుంచి పడగానే స్పృహపోయింది సుధీర్‌కి.

మొనదేలిన కంకరరాయి నుదురు కణతకి గుచ్చుకుంది. కోపంతో తోశాడుగానీ తమ్ముడు

# తాడేపల్లి భాగ్యలక్ష్మీమాధవ్

అలా క్రిందపడుతూంటే భయంతో ఏంచేయాలో తోచక... ఇంట్లోకి పరుగెత్తాడు చంద్రం అమ్మకి చెప్పేందుకు.

"జానకమ్మ ఏడుస్తూ బయటకొచ్చింది." అప్పటికే దారేపోయే వారంతా మూగారు. గబగబా లోపలకు తీసుకొచ్చారు సుధీర్‌ని స్పృహరాలేదు.

ఆఫీసునుంచీ ఇంటికి వస్తున్న రావుగారు తన ఇంటి ముందు జనం మూగి ఉండటంతో కంగారుగా పరుగెత్తుకొచ్చారు.

"జనం అందరూ తప్పుకున్నారు ఆయనను చూసి. ఆయన లోపలకడుగు పెట్టారు. అంతే! సుధీర్ ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసి పోయాయి. జానకమ్మ సుధీర్ మీద వాలిపోయింది ఏడుస్తూ."

"ఏమిటిది? సుధీర్ చనిపోయాడా! పొద్దున ఆఫీసుకెడుతూంటే గుమ్మంలో నిల్చుని టాటా చెప్పిన తన ముద్దుబిడ్డ సుధీర్ ఇంక లేడా. ఆయన మెదడు మొద్దుబారిపోయింది. ఇదికలానిజమా!"

"ఆ... ఈ రోజుల్లో అన్నీ అలాగే జరుగుతున్నాయి. ఏ నిమిషానికి ఏదీ జరుగుతుందో తెలియటం లేదు. ఇంక చేసేదేముంది. ఏదో ఒక రోజు అందరం వెళ్ళవలసిన వారమే. కాస్త వెనకా ముందూ అంతే. లేలే జానకమ్మా! ఏడిస్తే ఏమొస్తుంది చెప్పు అంతా ఋణానుబంధం... ఇరుగుపొరుగు వారు ఓదారుస్తున్నారు జానకమ్మను."

"యాంత్రికంగా చేయవలసిందంతా చేసేసారు. పండులాంటి సుధీర్ మట్టిపాలయ్యాడు."

"చంద్రం ఒక మూల కూర్చుని ఆలోచిస్తున్నాడు."

"తమ్ముడిని ఎక్కడకు తీసుకెళ్ళారు? ఇంక రాడా! ఎందుకూ? పెనిసిల్ ఇచ్చేస్తాగా వస్తే ఇస్తానని చెప్పేందుకు సుధ లేడుగా... మరి ఎలా అయినా సుధ ఎక్కడకు వెళ్ళాడు... పక్కింటి మామ్మను కూడా అలాగే తీసుకెళ్ళారు. అమ్మని అడిగితే దేముడిదగ్గరకు అంది అయితే సుధీర్ కూడా దేముడి దగ్గరకెళ్లాడా!"

"అమ్మ పిన్నివాళ్ళకి ఉత్తరాలు రాస్తుందిగా తనకూడా తమ్ముడికి ఉత్తరం రాస్తే అంతే ఆ ఆలోచన రాగానే గబగబా లేచి తన పెన్సిలు తెచ్చి ఒంకర అక్షరాలతో ఉత్తరం రాయసాగాడు."

"తమ్ముడూ... నా మీద కోపం వచ్చి వెళ్ళిపోయావా? అక్కడ బాగుందా? నాకేం తోచటం లేదు. అమ్మ ఎపుడూ ఏడుస్తూంది. నన్ను అసలే చూడటం లేదు. నాన్న కూడా నన్ను కౌగిలించుకుని ఏడుస్తారు! నువురా తమ్ముడూ నువ్వు రాకపోతే నాకు ఏడుపొస్తుంది."

నువ్వు వస్తే నా పెన్సిల్ ఇచ్చేస్తా... లేకపోతే... నేను కూడా వచ్చేస్తా... నువ్వు తొందరగా రా... నిన్నుచూస్తే... అమ్మ ఏడవదు... సంతోషంతో నవ్వుతుంది... వస్తావు కదూ...

నీ అన్న చంద్రం.

"ఏమిటి బాబూ! రాస్తున్నావు అంటూ వచ్చారు రావుగారు తడబడుతూ లేచి నిలుచున్నాడు చంద్రం."

"ఏది? నేను చూస్తాను ఏంరాసేవో... అంటూ చంద్రం. చేతిలోని కాగితాన్ని తీసుకుని చూశారు రావుగారు."

"అర్థంకాని రాతలో ఉన్న ఆ అక్షరాలన్నీ కూడాబలుక్కుని చదువుకున్న రావుగార్కి దుఃఖం ఆగలేదు. బాబూ! అంటూ చంద్రాన్ని కౌగలించుకున్నారు. చంద్రానికి కూడా ఏడుపు ఆగటం లేదు. నాన్నా... తమ్ముడు"

అవును బాబూ! తమ్ముడు దేముడి దగ్గరే ఉన్నాడు. నీ వుత్తరం తమ్ముడికి అందుతుంది. తప్పకుండా జవాబు రాస్తాడు. త్వరగా వస్తాడు ఏదీ ఇటు చూడు... ఈ ఉత్తరం నేను తమ్ముడికి పంపుతాను... సరేనా! కొడుకు తల నిమురుతూ అడిగారు రావుగారు సరేనన్నట్లుగా తల ఊపాడు మౌనంగా చంద్రం.

★ ★ ★

చంద్రం రోజూ పోస్ట్‌మాన్ కోసం ఎదురు చూస్తున్నాడు. అతను వచ్చే టైముకి అరుగుమీద కూర్చుంటాడు. అమ్మకి ఉత్తరాలు ఇచ్చేది అతనేగా... అదే ఆ పసి మనసుకి తెలుసు. అందుకే ఆశగా ఎదురుచూస్తాడు.

"రోజూలాగే అరుగుమీద కూర్చున్న చంద్రానికి పోస్ట్‌మాన్ ఒక ఉత్తరం ఇచ్చాడు."

"గబగబా చించి కూడ పలుక్కుంటూ చదువుకున్నాడు చంద్రం. అన్నయ్యా! నువ్వు రాసిన ఉత్తరం అందింది. నేను బాగానే ఉన్నాను అమ్మా, నాన్నా నువ్వూ ఏడుస్తున్నారా నా కోసం? ఎందుకూ? నేను వచ్చేస్తాగా... మరి కొన్నాళ్ళాగాలి మరి... దేముడిని అడగొద్దూ! అన్నట్లు నువ్వు బాగా చదువుకో... అమ్మని ఏడవద్దని చెప్పు... నేవచ్చేస్తాగా... పెన్సిల్ బాగా రాస్తుందా... నాకు ఇక్కడ చాలా బాగుంది. అయినా తొందరలో నీ కోసం వచ్చేస్తా... ఉంటాను."

సుధ

చొక్కాతో కళ్ళు తుడుచుకుంటూ ఆనందంతో లోపలకు పరుగెత్తాడు చంద్రం ఉత్తరం తండ్రికి చూపించేందుకు.

తలుపు చాటు నుంచీ అంతా చూస్తున్న రావుగారు ప్రక్కకు తప్పుకున్నారు కళ్ళు తుడుచుకుంటూ. ★



సెక్సీగా ఫోజులివ్వడానికీ, ఫోటోలు తీయించుకోవడానికీ, నటించడానికీ షీబా చాలా ముఖ్యంగా చెప్పుకోవాలి. శృంగారం చిలికే ఈమె చిత్రాలు చూసే వారి గుండెల్లో సమ్మోహనాస్త్రాల్ని గుప్పిస్తాయి.

## అంత సెక్సీగా వుండను

ఈ విషయాన్ని షీబా అంగీకరించలేదు.

'నిజ జీవితంలో నేను అంత సెక్సీగా వుండను' అంది షీబా.

'ఎలా వుంటుంది? ఆమె చెప్పినట్టుగా అలా వుంటదో లేదో తెలుసుకోవడం ఎలా?' అని వాపోయాడొకాయన.

### పూలు

"ఏమండీ... ఇవాళ్ళ అయినా నాలుగు పూలు వచ్చేటప్పుడు తీసుకురండి" ప్రేమగా అడిగింది భర్తని ఓ భార్య.

"ఎలాగూ... అమ్ముడు కాకపోత్తే ఇంటికేగా తెచ్చేది... ఇది మళ్ళీ నువ్వు ప్రత్యేకంగా చెప్పాలా నాకు?!" అని కోపంగా జవాబు చెప్పాడు పూల వ్యాపారం చేసే ఆ భర్త.

—సాయిగంగాధర్ చామర్తి